క్లుప్తంగా

వృద్ధులకు దుప్పట్లు పంపిణీ



వృద్ధురాలికి దుప్పటి అందజేస్తున్న యువకులు

ఇచ్ఛాపురం రూరల్: ఈదుపురం గ్రామానికి చెందిన బెహరా యూత్ అసోసియేషన్ సభ్యులు బుధవారం వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేశారు. ప్రస్తుతం చలి తీవ్రత అధికంగా ఉండటంతో వృద్ధులకు దుప్పట్లు అందజేశామని సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు హంగేర్ బెహరా, పాల్ బెహరా, యాంగిచ్, సోమేష్, జితు, కరుణాకర్, ప్రసాద్, సాలోమన్ ఉన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి



యువతకు అవగాహన కల్పిస్తున్న ఎస్సై చిన్నంనాయుడు

ఇచ్ఛాపురం: సైబర్ నేరాలపై యువత అప్రమత్తంగా ఉండాలని ఇచ్ఛాపురం పట్టణ ఎస్సై ఇ.చిన్నంనాయుడు అన్నారు. పట్టణంలో చిదంబరేశ్వర ఆలయంలో సమీపంలో యువతతో బుధవారం సాయంత్రం సమావేశం నిర్వహించారు. సైబర్‌నేరాలు, రోడ్డుభద్రత, గంజాయి, డ్రగ్స్ వంటి మత్తు పదార్థాలపై అవగాహన కల్పించారు.

కరపత్రాలు ఆవిష్కరణ



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న జైభీమ్ సేన సభ్యులు

ఇచ్ఛాపురం: సోంపేటలో ఈనెల 29వ తేదీన జరుగనున్న జైభీమ్‌సేన రెండో ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని ముత్యాలమ్మపేటలో కార్యక్రమాలకు సంబంధించిన కరపత్రాలను జిల్లా అసోసియేటివ్ ప్రెసిడెంట్ సల్లా దేవరాజు ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. అంబేడ్కర్ వాదులు కార్యక్రమానికి తరలిరావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సంఘ ప్రతినిధులు ఈశ్వరరావు, ఎస్.బాబూరావు, దేవరాజు, శ్యామ్, లోహిదాస్, ధర్మ, వెంకటరావు, మ పాల్గొన్నారు.

డీవీఎంసీ సభ్యుడుగా రమణమూర్తి

టెక్కలి: జిల్లా విజిలెన్స్ అండ్ మానిటరింగ్ నాన్ అఫీషియల్ సభ్యునిగా టెక్కలి మండలం పాతనాపడ గ్రామానికి చెందిన గేదెల రమణమూర్తిని నియమించారు. ఎరుకుల సామాజిక వర్గానికి సంబంధించి వివిధ సమస్యలపై అధికారుల దృష్టికి తీసుకువెళ్లేందుకు ఈ నియామకం చేపట్టినట్లు రమణమూర్తి పేర్కొన్నారు. ఈయన నియామకంపై ఎరుకుల సేవా సంఘం ప్రతినిధులు హర్షం వ్యక్తం చేశారు.

జెడ్పీ చైర్‌పర్సన్ పరామర్శ



కవిటి: నరేష్‌ను పరామర్శిస్తున్న చైర్‌పర్సన్ విజయ

కవిటి: చిన్నజల్లుపుట్టుగకు చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు జల్లు నరేష్ రోడ్డు ప్రమాదంలో గాయపడ్డారు. ఈ విషయం తెలుసుకున్న జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ పిరియా విజయ నరేష్‌ను బుధవారం పరామర్శించారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

సోంపేట: బారువ గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు భువనేశ్వర్ పాణిగ్రాహి తల్లి లలితాంబ ఇటీవల మృతి చెందారు. దీంతో పాణిగ్రాహి కుటుంబాన్ని జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ బుధవారం పరామర్శించి సంతాపం తెలియజేశారు. బారువ సర్పంచ్ యర్ర రజని, వైస్ ఎంపీపీ గురాల శ్రీను, పార్టీ నాయకులు తెప్పల ధర్మారావు, దున్న తిరుపతి, మదనాల రమేష్ ఉన్నారు.

గిరిజన సమస్యలపై ప్రత్యేక దృష్టి



క్యాలెండర్ ఆవిష్కరణలో తహసీల్దార్ కళ్యాణ చక్రవర్తి తదితరులు

కాశీబుగ్గ: పలాస మండలం పరిధిలో ఉన్న గిరిజన సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించి పరిష్కారించేందుకు కృషి చేస్తానని తహసీల్దార్ కళ్యాణ చక్రవర్తి అన్నారు. పాత్రియ గ్రామంలో సియోన్ గ్రేస్ చర్చిలో బుధవారం క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. క్రిస్మస్ కేక్ కట్ చేసి అనంతరం 2025 నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భూసమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకువస్తే పరిశీలించి పరిష్కరిస్తామన్నారు. పలాస మండల కేంద్రంలో గిరిజన భవన్ నిర్మాణానికి అవసరమైన స్థలాన్ని ఎమ్మెల్యే దృష్టిలో పెట్టి కేటాయిస్తామన్నారు. పాస్టర్, ఆదివాసీ ఉద్యోగుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు సవర జగన్నాయకులు, ఏఎంసీ మాజీ డైరెక్టర్ సవర కృపావతి, గిరిజన నాయకులు సవర రాంబాబు, ఇసిద్దు, ఈశ్వరరావు ఉన్నారు.

అందని వైద్యం!

- అటకెక్కిన వెల్‌నెస్ కేంద్రాలు
- పట్టించుకోని కూటమి పాలకులు
- వైద్య సేవల కోసం ప్రజలు ఇబ్బందులు



బొడ్డపాడు కాలనీలో తెరుచుకోని ఆరోగ్య కేంద్రం

పలాస: గ్రామీణ ప్రాంతాల్లోని పేద ప్రజలకు ఆ గ్రామంలోనే ప్రాథమిక వైద్యం అందించాలన్న గత ప్రభుత్వం లక్ష్యానికి కూటమి ప్రభుత్వం తూట్లు పొడుస్తుంది. మండలానికి ఒక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంతో పాటు పంచాయతీ స్థాయిలో హెల్త్ వెల్‌నెస్ సెంటర్లను (హెచ్‌డబ్ల్యూసీ) అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఏర్పాటుకు శ్రీకారం చుట్టారు. ఒక్కో కేంద్రం భవనానికి రూ.17.50 లక్షలు వెచ్చించి నిర్మాణాలను చేపట్టారు. అంతేకాకుండా అక్కడ అన్ని మౌలిక సదుపాయాలను సిద్ధం చేశారు. ఆ కేంద్రాల్లో మిడ్ లెవల్ హెల్త్ ప్రొవైడర్ (ఎంఎల్‌హెచ్‌పీ), ఒక హెల్త్ అసిస్టెంట్, ఒక ఏఎన్‌ఎం, ఆశ వర్కరు ఉండి అక్కడ ప్రజలకు సేవలు అందించాల్సి ఉంది. ఈ విధంగా పలాస మండలంలో 13, వజ్రపుకొత్తూరు మండలంలో 25, మందస మండలంలో 17 భవనాలను నిర్మించారు. ఇందులో 80 శాతం భవనాల నిర్మాణాలు పూర్తయ్యాయి. కొన్ని గ్రామాల్లో వాటిని ప్రారంభించారు. మరికొన్ని గ్రామాల్లో అసంపూర్తిగా భవనాలు ఉన్నాయి. అయితే అంతలోనే ప్రభుత్వం మారడంతో వాటిని పట్టించుకున్న వారు కరవయ్యారు. ఒకటి రెండు చోట్ల మాత్రమే ఆ కేంద్రాలు పనిచేస్తున్నాయి. ముఖ్యంగా వజ్రపుకొత్తూరు మండలం దేవునల్తాడ, పలాస మండలం అల్లుకోల, లొత్తూరు గ్రామాల్లో పనిచేస్తున్నట్లు అక్కడ ప్రజలు చెబుతున్నారు. మిగతా చోట్ల కేంద్రాలను తెరిచే వారు కూడా లేకపోవడం విశేషం. దీంతో గ్రామీణ ప్రాంత ప్రజలకు ఈ వైద్య సేవలు అందని ద్రాక్షలా మారాయి. చిన్న చిన్న వ్యాధులకు కూడా ప్రైవేటు ఆస్పత్రులను ఆశ్రయించాల్సి వస్తుంది. ముఖ్యంగా ఉద్దానం ప్రాంతంలో కిడ్నీ వ్యాధులతో అనేక మంది ఇబ్బందులు పడుతున్నారు. ఏ చిన్న సమస్య వచ్చినా పలాస పట్టణానికి వెళ్లాల్సి వస్తుందని, హెచ్‌డబ్ల్యూసీలను అందుబాటులోకి తీసుకు రావాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రజలకు అందుబాటులో ఉంటున్నాం

పలాస మండలానికి రెంటికోట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఉంది. అక్కడ సిబ్బంది పూర్తి స్థాయిలో ఉన్నారు. హెల్త్ డబ్ల్యూసీల విషయానికి వస్తే పలాస మండలంలో మూడు కేంద్రాలు పనిచేస్తున్నాయి. ప్రజలకు అందుబాటులో ఉంటున్నాము. చిన్న చిన్న సమస్యలు వల్ల ఆ కేంద్రాలు తెరుచుకోలేక పోతున్నాయి. వాటిని పరిష్కరిస్తే గ్రామీణ ప్రాంత ప్రజలకు పూర్తి స్థాయిలో వైద్యం అందుతోంది.

– డాక్టర్ సునీల్ కుమార్, రెంటికోట పీహెచ్‌సీ వైద్యాధికారి, పలాస మండలం

మంచినీటి సమస్య



బొడ్డపాడు కాలనీ వద్ద గత ప్రభుత్వంలో గ్రామీణ ఆరోగ్య కేంద్రాన్ని నిర్మించారు. అందులో అన్ని సదుపాయాలను సమకూర్చారు. కేవలం మంచినీటి సదుపాయం లేదు. ఒక బోరు వేస్తే సరిపోతుంది. తక్షణమే ఆ సమస్యను పరిష్కరించి కేంద్రాన్ని పనిచేసే విధంగా తగిన చర్యలు తీసుకోవాలి. మాకు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం అందుబాటులో లేదు. ఏ చిన్న సమస్య వచ్చినా పలాస వెళ్లాల్సి వస్తుంది.

– మద్దిల పాపారావు, ఎంపీటీసీ సభ్యుడు, బొడ్డపాడు, పలాస మండలం

కాలువ పొంగింది..



సాధారణంగా వాగులు, చెరువులు పొంగి పొర్లడం అందరికీ తెలుసు. అయితే టెక్కలి మేజర్ పంచాయతీ పరిధి రోటరీనగర్-1లో మురుగు కాలువలో మురుగు నీరంతా రోడ్లపైకి ప్రవహించడంతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. కాలువలో చెత్త నిల్వలు పేరుకుపోవడంతో మురుగు నీరంతా రోడ్లపైకి ప్రవహించడంతో రాకపోకలు సాగించేవారు అవస్థలు పడుతున్నారు. ఇప్పటికైనా పంచాయతీ యంత్రాంగం స్పందించి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు. – టెక్కలి

కార్యాలయాలకు వెళ్లేది ఎలా..?



చిన్నపాటి చినుకు పడితే చాలు ఆ రహదారి గుండా నడిచి వెళ్లేందుకు అధికారులు, ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఇచ్ఛాపురం తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో ఉప ఖజానా కార్యాలయం, గ్రంథాలయం, డీసీసీబీ కార్యాలయం, పీఏసీఎస్ కార్యాలయాలు ఉన్నాయి. ఎంతో ప్రాధాన్యం ఉన్న ఈ రోడ్డు శిథిలమైంది. దీంతో చిన్న వర్షం పడినా నీటితో నిండిపోతుంది. వేలాది మంది రాకపోకలు సాగించే ఈ రహదారిపై ప్రభుత్వానికి, ప్రజాప్రతినిధులకు చిత్తశుద్ధి కరువైందని విమర్శలు వస్తున్నాయి. – ఇచ్ఛాపురం రూరల్

నిత్య కృత్యం..



పలాస-కాశీబుగ్గ ఎల్‌సీగేటు వద్ద రైల్వే ఫ్లై ఓవర్ పనులు నాలుగు ప్రభుత్వాలు మారినప్పటికీ పూర్తికాలేదు. దీంతో ప్రయాణికులకు కష్టాలు తప్పడం లేదు. ఫలితంగా గేటువేసినప్పుడల్లా గంటల తరబడి వాహనదారులు నిరీక్షించాల్సి వస్తుంది. కొంతమంది మాత్రం రైలు గేటు వేసిన వెంటనే దాటిపోవడానికి గేటు కింద నుంచి దూరి ప్రమాదకరంగా వెళ్తున్నారు. ట్రాఫిక్ పోలీసులు, జీఆర్పీ, ఆర్పీఎఫ్, రైల్వే అధికారులు ఈ ప్రమాదకర దృశ్యాన్ని చూస్తున్నా ఏం చేయలేకపోతున్నారు. – కాశీబుగ్గ

వైఎస్సార్ జంక్షన్ నుంచి ర్యాలీ రేపు

- వైఎస్సార్‌సీపీ టెక్కలి నియోజకవర్గ ఇన్‌చార్జి తిలక్



మాట్లాడుతున్న పేరాడ తిలక్

టెక్కలి: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత పెంచిన విద్యుత్ చార్జీలకు నిరసనగా శుక్రవారం ఉదయం తొమ్మిది గంటలకు టెక్కలి పట్టణంలోని వైఎస్సార్ జంక్షన్ నుంచి భారీ ర్యాలీ నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి పేరాడ తిలక్ వెల్లడించారు. బుధవారం ఆయన మాట్లాడుతూ.. నియోజకవర్గంలోని పార్టీ నాయకులు, కార్యకర్తలు, విద్యుత్ వినియోగదారులంతా వైఎస్సార్ జంక్షన్‌కు చేరుకోవాలని కోరారు. ఇక్కడ నుంచి విద్యుత్‌శాఖ డీఈఈ కార్యాలయం వరకు ర్యాలీగా వెళ్లి అధికారులకు వినతిపత్రాన్ని అందజేయనున్నట్లు పేర్కొన్నారు. వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన పిలుపు మేరకు ప్రజలకు అండగా నిర్వహిస్తున్న ఈ నిరసన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

ఆర్థిక సహాయం..



సంతబొమ్మాళి మండలం సీతానగరం గ్రామానికి చెందిన గరికి శ్రీను ఇటీవల చనిపోయాడు. కుటుంబ పెద్ద మరణంతో ఆ కుటుంబం ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటుంది. భార్య బుజ్జి కూడా అనారోగ్యంతో బాధపడుతోంది. ఈ విషయం తెలుసుకున్న ఉద్దానం అభ్యుదయ సేవాసమితి సభ్యులు రూ. పది వేలు సేకరించారు. ఆ మొత్తాన్ని బాధిత కుటుంబానికి బుధవారం అందజేశారు. సేవాసమితి అధ్యక్షుడు తామాడ లక్ష్మణరావు, సభ్యులు మండల మహేష్, చింత మోహన్‌రావు, గొండి రవి, దండుపాటి పవన్ కుమార్, తామాడ కోదండరావు, కోళ్ల కృష్ణారావు, కొంకి మోహిని ఉన్నారు. – సంతబొమ్మాళి

లోక రక్షకుడు ఏసుక్రీస్తు..

క్రిస్మస్ పర్వదినాన్ని క్రైస్తవులు ఘనంగా బుధవారం జరుపుకున్నారు. లోక రక్షకుడు..కరుణామయుడైన యేసయ్యకు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. చర్చిలు, ప్రార్థన మందిరాలను విద్యుత్ దీపాలతో సుందరంగా అలంకరించారు. మతాలకు అతీతంగా క్రిస్మస్ శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు. ఈ సందర్భంగా పిల్లలకు పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. సాంస్కృతిక ప్రదర్శలతో చిన్నారులు అలరించారు. శాంటాక్లాస్ గెటాప్ వేసుకున్న వారు పిల్లలకు మిఠాయిలు పంచిపెట్టి సందడి చేశారు. పాస్టర్లు క్రీస్తు సందేశాన్ని వినిపించారు. ఆయన చూపిన సన్మార్గంలో నడవాలని బోధన చేశారు. క్రీస్తు బోధనలను అరుసణీయమని వక్తలు అన్నారు. క్రిస్మస్ కేక్‌ను కట్‌చేసి పంచిపెట్టారు. ప్రజాప్రతినిధులు, అధికారులు చర్చలకు వెళ్లి ప్రార్థనల్లో పాల్గొన్నారు. నిరుపేదలకు దుస్తులను పంపిణీ చేశారు. – సాక్షి నెట్‌వర్క్



టెక్కలి: లివింగ్‌స్టోన్ చర్చిలో క్రిస్మస్ కేకును కట్ చేస్తున్న కేంద్ర మాజీ మంత్రి కిల్లి కృపారాణి, పాస్టర్ అబ్రహం తదితరులు



కవిటి: కవిటి రెహబోతు చర్చిలో ప్రార్థనలు చేస్తున్న క్రైస్తవులు



కంచిలి: జాడుపూడి చర్చిలో కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్సీ నర్తు రామారావు తదితరులు



సోంపేట: కొర్లాం జేసీహోలీ చర్చిలో పేదలకు వస్త్రాలు పంపిణీ చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకుడుపైడి పట్టాభి



కంచిలి చర్చిలో చిన్నారుల సాంస్కృతిక ప్రదర్శన



ఇచ్ఛాపురం రూరల్: ఈదుపురం కంద్రావార్డు చర్చిలో కేక్ కట్ చేస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ



నందిగాం చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న దృశ్యం



వజ్రపుకొత్తూరు రూరల్: దోకులపాడు చర్చిలో సందడి చేస్తున్న క్రైస్తవులు



ఇచ్ఛాపురం: ఆంధ్రాబాప్టిస్టు చర్చిలో క్రిస్మిస్ వేడుకలు



కాశీబుగ్గ: చినబడంలో ఏసు ప్రార్థన చేస్తున్న బిషప్ డి.ఎస్.వి.ఎస్.కుమార్



కాశీబుగ్గ: మాజీ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు స్వగృహంలో క్రైస్తవులతో కలిసి క్రిస్మస్ కేక్ కటింగ్



కాశీబుగ్గ: చర్చిలో యువతుల నృత్య ప్రదర్శన



కాశీబుగ్గ: బాపనవూరు చర్చిలో కేక్ కట్ చేస్తున్న పలాస తహసీల్దార్ కల్యాణ చక్రవర్తి



కాశీబుగ్గ: ఏడోవార్డు క్రిస్టియన్ ప్రెయర్ టెంపుల్లో చిన్నారులకు వస్త్రాలు అందజేస్తున్న మున్సిపల్ వైస్ చైర్మన్ మీసాల సురేష్‌బాబు దంపతులు

మహోన్నత వ్యక్తి వాజ్‌పేయి



టెక్కలి: వాజ్‌పేయి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న బీజేపీ కార్యకర్తలు



కాశీబుగ్గ: వాజ్‌పేయి విగ్రహానికి నివాళులర్పిస్తున్న నాయకులు

టెక్కలి: మహోన్నతమైన రాజకీయ వేత్త దివంగత మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయి అని బీజేపీ కార్యకర్తలు కొనియాడారు. టెక్కలిలో వాజ్‌పేయి శత జయంతి కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వాజ్‌పేయి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో జె.పరమేశ్వరరావు, ఎ.కామరాజు, కె.జగన్నాథం ఉన్నారు.

కాశీబుగ్గ: మాజీ ప్రధానమంత్రి దివంగత అటల్ బిహార్‌వాజ్‌పేయి శతజయంతి ఉత్సవాలను కాశీబుగ్గ బస్టాండ్ ఎదురుగా ఉన్న ఆయన విగ్రహం వద్ద బుధవారం నిర్వహించారు. పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ బీజేపీ అధ్యక్షులు వైశ్యరాజ్ మోహన్‌రాజు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి పాలవలస వైకుంఠరావు మాట్లాడుతూ.. వాజ్‌పేయి గొప్ప వ్యక్తిత్వం గల మహాశక్తి, గొప్ప రాజనీతిజ్ఞుడు, వ్యూహకర్త అన్నారు. ఐక్యరాజ్య సమితిలో హిందీలో ప్రసంగించిన మొట్టమొదటి వ్యక్తని గుర్తు చేశారు. బీజేపీ నాయకులు కొర్రాయి బాలక్రిష్ణయాదవ్, తమ్మినాన మాధవరావు, నెమలిపురి అప్పారావు పాల్గొన్నారు.

ప్రమాద కూడలి !



కంచిలిలోకి వచ్చే మార్గంలో సర్వీసు రోడ్డుకు కలిపి నిర్మించని భాగం



బలియాపుట్టుగ, పాత్రపడ గ్రామాలకు వెళ్లే మార్గంలో అధ్వానంగా ఉన్న సర్వీసు రోడ్డు



సోంపేటకు వెళ్లే మార్గంలో సర్వీసు రోడ్డుపైకి వచ్చిన మెటల్, ఇసుక మేట

కంచిలి: మండల కేంద్రం కంచిలిలోకి వచ్చేందుకు, మరోవైపు బలియపుట్టుగ, పాత్రపడ గ్రామాలకు వెళ్లేందుకు జాతీయ రహదారి నుంచి రెండు వైపులకు మార్గం ఇచ్చిన కూడలి ప్రమాదాలకు నిలయంగా మారింది. ఇక్కడ జాతీయ రహదారి నుంచి సర్వీసు రోడ్డు మీదుగా రెండు వైపులా గ్రామాల్లోకి వెళ్లేందుకు ఉన్న మార్గాలకు కలిపే రోడ్ల నిర్మాణం చేపట్టలేదు. జాతీయ రహదారి నిర్మాణం నుంచి ఇక్కడ ఇదే పరిస్థితి నెలకొని ఉంది. జాతీయ రహదారికి, సర్వీసు రోడ్డుకు మధ్యలో రోడ్డును కలుపుతూ నిర్మాణం చేపట్టలేదు. దీంతో ఈ కూడలి వద్ద నుంచి రాకపోకలు సాగించే వాహనదారులు భయాందోళనకు గురౌతున్నారు. అలాగే బలియాపుట్టుగ గ్రామ కూడలి నుంచి సోంపేట వైపు వెళ్లే సర్వీసు రోడ్డు మీదకు చాలా కాలంగా మెటల్ కంకర, ఇసుకతో మేట వేసింది. దీన్ని రహదారి నిర్వహణ విభాగం కనీసం పట్టించుకోవడం లేదు. ఇక్కడ వాహనాలు స్కిట్ అవుతున్నాయని ఆందోళన వ్యక్తం అవుతోంది.